

దరఖాస్తులను పరిశీలించాలి

ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

- 10లో ▸



ట్రాన్స్‌ఫార్మర్లే టార్గెట్

దొంగలు ట్రాన్స్‌ఫార్మర్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నారు. దీంతో రైతులు ఇబ్బందిపడాల్సి వస్తోంది.

- 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
31.1 /20.9

వాతావరణం

ఉదయం ఈదురుగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. చలితీవ్రత తగ్గుతుంది.

న్యూస్‌రీల్

ఎమ్మెల్సీగా మహేశ్‌కుమార్ గౌడ్ ఎన్నిక



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి సోమవారం ప్రకటించారు. ఈ మేరకు మహేశ్‌కుమార్‌కు హైదరాబాద్‌లో ధ్రువప త్రాన్ని అందజేశారు.

ఎంబీబీఎస్ ఫస్టియర్ ఫలితాలు విడుదల

- మెడికల్ కళాశాలలో 95.83 శాతం ఉత్తీర్ణత

నిజామాబాద్‌నాగారం: ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం ఫలితాలు విడుదలయ్యాయి. ఇందులో నిజామాబాద్ మెడికల్ కళాశాల విద్యార్థులు 95.83 శాతం ఉత్తీర్ణత సాధించారు. 2022 సంవత్సరానికి సంబంధించి 2023 నవంబర్‌లో విద్యార్థులు మొదటి సంవత్సర పరీక్షలు రాశారు. ఈ ఫలితాలు ప్రస్తుతం విడుదలయ్యాయి. నిజామాబాద్ మెడికల్ కళాశాలకు చెందిన 120 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా ఐదుగురికి 75 శాతానికి పైగా మార్కులు వచ్చాయి. 65 మంది విద్యార్థులు ఫస్ట్‌క్లాస్‌లో ఉత్తీర్ణత సాధించారు. మరో 45 మంది విద్యార్థులు పాసయ్యారు. ఐదుగురు విద్యార్థులు ఫెయిల్ అయినట్లు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఇందిరా తెలిపారు.

బడాపహాడ్ ఉర్సు ప్రారంభం



వర్ని: మండలంలోని జలాల్పూర్ బడాపహాడ్ ఉర్సు సోమవారం ప్రారంభమైంది. ఎమ్మెల్యే పోచారం కార్యక్రమాన్ని ప్రారంభించారు. జలాల్పూర్ నుంచి గంధాలను ఊరేగింపుగా బడా పహాడ్‌కు తీసుకువెళ్లారు. ఉర్సు బుధవారం వరకు కొనసాగనుంది. ఉత్సవాల్లో డీసీసీబీ అధ్యక్షుడు పోచారం భాస్కర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి, బీఆర్ఎస్ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి పోచారం సురేందర్ రెడ్డి, జెడ్పీటీసీ హరిదాసు, నాయకులు ఎలమంచిలి శ్రీనివాసరావు, గోపాల్, వీర్రాజు, సర్పంచ్ అనిత వెంకట్ గౌడ్ పాల్గొన్నారు.

పోటాపోటీగా ప్రారంభించిన నాయకులు

ఉర్సును ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు పోటాపోటీగా ప్రారంభించారు. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి మొదట ఉత్సవాలను ప్రారంభించి గంధాలను ముజావర్లకు అందించారు. తిరిగి గంధాలను సభాస్థలి వద్దకు తీసుకువచ్చి మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి మరోసారి ఉత్సవాలను ప్రారంభించారు.

రంగంలోకి ఎన్నికల కమిషన్

- మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికకు ఏర్పాట్లు

ఆర్మూర్: ఆర్మూర్ మున్సిపల్ చైర్ పర్సన్ ఎన్నిక అంశం ఎన్నికల కమిషన్ పరిధిలోకి వెళ్లింది. చైర్ పర్సన్ పండిత్ వినీతపై అవిశ్వాస తీర్మానం ఆమోదం పొందడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న స్థానాలను గుర్తించి ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ సెక్రెటరీ అజయ్ కుమార్ ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్‌కు సోమవారం లేఖ రాశారు. చైర్ పర్సన్ ఎన్నిక అంశం ఎన్నికల కమిషన్ పరిధిలోకి వెళ్లడంతో త్వరలో నోటిఫికేషన్ వెలువడుతుందని ఆశావహులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ వేళ డెలివరీలు

నిజామాబాద్ నాగారం: అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ జరుగుతున్న శుభ సందర్భంలోనే జిల్లాలో కొన్ని డెలివరీలు జరిగాయి. దీంతో కుటుంబ సభ్యుల ఆనందానికి అవధులు లేకుండా పోయింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో రెండు సాధారణ, రెండు సిజేరియన్ డెలివరీలు చేశారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లోనూ పదుల సంఖ్యలో డెలివరీలు అయ్యాయి.



రాముడి వేషధారణలో చిన్నారి



అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని జిల్లా కేంద్రంలోని బడా రాంమందిర్‌లో స్క్రీన్‌పై వీక్షిస్తున్న భక్తులు



నగరంలోని సుభాష్‌నగర్ రామాలయంలో సీతారాముల కల్యాణం



ఖిల్లా రామాలయంలో బారులు తీరిన భక్తులు

స్వప్నం సాకారం..

ఊరూవాడా సంబురం

- అయోధ్యలో కొలువుదీరిన బాలరాముడు
- ప్రతిష్ఠ వేళ జిల్లావ్యాప్తంగా కనుల పండువగా వేడుకలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు, భజనలు, కీర్తనలు
- ప్రత్యక్ష ప్రసారం చూసేందుకు భారీ స్క్రీన్ల ఏర్పాటు
- వాడవాడలా జైశ్రీరాం జెండాలతో ర్యాలీలు
- రాత్రి ఆలయాలు, ఇళ్లలో దీపోత్సవాలు
- మహోన్నతం, అద్భుతం: ఎంపీ అర్వింద్

అయోధ్య నగరిలో అపూర్వ ఘట్టం ఆవిష్కృతమైంది. బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ వేళ.. ఇందూరు వాసులు సంబురాలు చేసుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకలను భక్తులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించి తరించారు. జగదభిరాముడికి జేజేలు పలికారు. సాయంత్రం వేళలో ఇంటింటా దీపాలు వెలిగించి పండుగ చేసుకున్నారు.

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: రామజన్మ భూమిలో రామయ్య ప్రతిష్ఠ సందర్భంగా సోమవారం ఊరూవాడా పండుగ వాతావరణం నెలకొంది. జిల్లా వ్యాప్తంగా ఆలయాలు రామనామ స్మరణతో మార్మోగాయి. ఆ జగదభిరాముడికి భజనలు, కీర్తనలు, కల్యాణోత్సవాలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా కేంద్రంతో పాటు పట్టణాలు, పల్లెల్లో శోభాయాత్రలు నిర్వహించారు. చిన్నా, పెద్దా అందరూ రామయ్య ధ్వజాలను పట్టుకుని ర్యాలీల్లో పాల్గొనడంతో పండుగ వాతావరణాన్ని తలపించింది. రామ్‌లల్లా విగ్రహ ప్రతిష్ఠాపన ప్రత్యక్ష ప్రసారాన్ని భక్తులు తిలకించేందుకు గాను అన్ని ఆలయాల్లో భారీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్, బజరంగ్‌దళ్, హిందూ వాహిని ఆధ్వర్యంలో వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం పూట ప్రజలు ఇంటింటా దీపాలు వెలిగించారు. అంతేకాకుండా పటాకులు కాల్చి దీపావళిలా వేడుకను జరుపుకున్నారు. నగరంలోని సుభాష్‌నగర్ రామాలయం, ఖిల్లా రఘునాథ ఆలయం, మహాలక్ష్మినగర్‌లోని అంజనేయస్వామి ఆలయంలో విద్యార్థులు శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. శంభుని గుడి వద్ద సుమారు వెయ్యి మంది మహిళలు శ్రీ రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ రాష్ట్ర కో-కన్వీనర్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో భారీ దీపోత్సవం చేశారు. సుభాష్‌నగర్‌లో కరసేవకుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ చాలీసా, మహాహారతి కార్యక్రమాలు నిర్వహించారు. ఎంపీ అర్వింద్ అయోధ్య నుంచి 'సాక్షి'తో ఫోన్‌లో మాట్లాడుతూ ఇదొక మహోన్నత ఘట్టమని, 500 ఏళ్ల కల సాకారమైందన్నారు.



ఖిల్లా రామాలయంలో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

ఆకట్టుకున్న పెయింటింగ్

నిజామాబాద్ పెద్దబజార్‌కు చెందిన అభి యువకుడు అయోధ్య ఆలయానికి రాముడు, సీతామాత ఆగమనం దృశ్యరూపాన్ని చక్కగా గీశాడు. సీతారాములు వస్తున్నప్పుడు ప్రజలు హర్షధ్వానాలు చెబుతున్నట్లు కాన్వాస్‌పై అద్భుతంగా గీయడంతో యువకుడిని పలువురు అభినందించారు. గంగాస్తాన్‌లోని ఆపిల్ ప్లే స్కూల్‌లో రామాయణం ప్రదర్శన వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల వేషధారణ లు ఆకట్టుకున్నాయి.



రాముడి జీవితం ఆదర్శం..

సమస్త మానవాళికి రాముడి జీవితం ఆదర్శమని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఖిల్లా రఘునాథ ఆలయంలో నిర్వహించిన ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు, కల్యాణం, అభిషేకాలు నిర్వహించారు. అయోధ్యలో రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని లైవ్‌లో భక్తులతో కలిసి వీక్షించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 500 ఏళ్లనాటి హిందువుల కల సాకారమైందన్నారు. రామ మందిర ప్రారంభోత్సవ మహా పుణ్యకార్యాన్ని మనం చూడడం మన పూర్వ జన్మ సుకృతమని పేర్కొన్నారు.



సీతారాముల వేషధారణలో ఉన్న చిన్నారులతో ఎమ్మెల్యే ధన్‌పాల్

హిందువుల కల నెరవేరింది..



దినేశ్‌ను సన్మానిస్తున్న భక్తులు

డిచ్‌పల్లి : అయోధ్య రామ మందిరంలో రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠతో హిందువుల 500 ఏళ్ల నాటి కల నెరవేరిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేశ్‌కుమార్ పేర్కొన్నారు. డిచ్‌పల్లి ఖిల్లా రామాలయంలో దినేష్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డిచ్‌పల్లి స్టేషన్, నడిపల్లి, అమృతాపూర్, ధర్మారం(బి) గ్రామాల్లోని ఆలయాల్లో జరిగిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దినేష్ మాట్లాడుతూ.. అయోధ్య రామమందిరం ప్రారంభంతో ప్రపంచ దేశాలలో ఆధ్యాత్మిక పరిమళాలు విరాజిల్లనున్నాయన్నారు.



నగరంలోని శంభుని గుడి వద్ద దీపారాధన చేస్తున్న మహిళలు





గోల్‌హనుమాన్ ఆలయం వద్ద దాండియా ఆడుతున్న మహిళలు, ఖిల్లా రామాలయం వద్ద శ్రీరాముడి భారీ ముగ్గు

ఫొటోలు: సాక్షిఫొటోగ్రాఫర్, నిజామాబాద్

గణతంత్ర దినోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్: గణతంత్ర దినోత్సవాలను పురస్కరించుకుని పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రిపబ్లిక్ డే కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అట్టహాసంగా వేడుకలు జరిగేలా ఆయా శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా సమగ్ర వివరాలతో జిల్లా ప్రగతి నివేదిక రూపొందించాలని ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యాన, జిల్లా గ్రామీణాభివృద్ధి, పశు సంవర్ధక, విద్య, వైద్యం, స్త్రీ, శిశు సంక్షేమం, ఫిషరీస్, రాష్ట్ర రోడ్డు రవాణా తదితర శాఖల పనితీరు చాటేలా స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఉత్తమ ఉద్యోగుల ఎంపిక కోసం శాఖల వారీగా పరిమితితో కూడిన ప్రతిపాదనలు పంపించాలన్నారు. ఈనెల 24న మధ్యాహ్నంలోపు వారి పేర్లను ప్రతిపాదనల రూపంలో సిఫార్సు చేయాలని అధికారులకు సూచించారు. గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని ట్రాన్స్ కో అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా సంక్షేమ శాఖతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో లబ్ధిదారులకు ఆస్తులు, దివ్యాంగులకు బ్యాటరీ వెహికల్స్, ఇతర ఉపకరణాల పంపిణీ కోసం అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో సీపీ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, అదనపు డీసీపీలు జయరాం, గిరిరాజు, జెడ్పీ సీఈవో గోవింద్, డీఆర్డీవో చందర్, ఆర్డీవో రాజేంద్రకుమార్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, అధికారులు పాల్గొన్నారు.

ఎండిన పసుపునకే ధర!

- తేమశాతం 12లోపు ఉండేలా మార్కెట్‌కు పంట తీసుకురావాలి
- అవగాహన కల్పించనున్న మార్కెటింగ్‌శాఖ
- ఉత్తర తెలంగాణ జిల్లాలకు బయల్దేరిన ప్రచార రథాలు..



రైతులకు అవగాహన కల్పించేందుకు సిద్ధం చేసిన ప్రచార రథాలు

సుభాష్‌నగర్: పసుపు రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో భాగంగా అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చేందుకు మార్కెటింగ్‌శాఖ సిద్ధమైంది. పంటకు ధర రావాలంటే తేమశాతం ముఖ్యం. బాగా ఎండబెట్టిన పసుపు మార్కెట్‌కు తీసుకురావాలని, తద్వారా మంచి ధర వస్తుందని రైతులకు అవగాహన కల్పించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసింది. ఇందుకోసం నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్‌కు ఒకటి చొప్పున అధికారులతో కూడిన ప్రచార రథాలు బయల్దేరాయి. ఐదు రోజుల పాటు ఆయా జిల్లాల్లో పసుపు పండిస్తున్న ప్రతి గ్రామానికి వెళ్లి అవగాహన కల్పించనున్నారు. నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డుకు జగిత్యాల్, నిర్మల్, కరీంనగర్, ఆదిలాబాద్, కామారెడ్డి జిల్లాల నుంచి రైతులు పసుపు పంటను తీసుకొస్తారు. నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల్‌తోపాటు ఆయా జిల్లాల్లో సుమారు 40 వేల ఎకరాల్లో పసుపు పంట సాగు చేస్తున్నారు. ఈ సీజన్‌లో మార్కెట్‌కు దాదాపు 5 లక్షల మెట్రిక్ టన్నుల పసుపు వస్తుందని మార్కెటింగ్ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. మరికొందరు రైతులు మహారాష్ట్రలోని సాంగ్లీ మార్కెట్‌కు తరలిస్తారు. గతంలో నిజామాబాద్ మార్కెట్‌కు ఏడాదిలో సుమారు 10 లక్షల మెట్రిక్ టన్నుల పసుపు వచ్చేది. పెట్టుబడి వ్యయం, కూలీల కొరత, మద్దతు ధర దక్కకపోవడంతో పసుపు సాగు పట్ల రైతులు అనాసక్తి చూపుతున్నారు. దీంతో ఏడాదికేడాది పసుపు సాగు విస్తీర్ణం పడిపోతోంది.

మూడు బృందాలు.. ఐదు రోజులు..

రాష్ట్రంలో ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లోనే రైతులు పసుపు పంటను సాగు చేస్తారు. రైతులు బాగా ఎండబెట్టిన పసుపు పంటను మార్కెట్‌కు తీసుకురావాలని అవగాహన కల్పించేందుకు నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో మూడు బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు ఐదు రోజులపాటు ఆయా జిల్లాల్లోని పసుపు పండిస్తున్న గ్రామాలకు వెళ్లి రైతులతో కలుస్తారు. ఈమేరకు ప్రచార రథాలను నిజామాబాద్‌లోని మార్కెట్ కమిటీలో గ్రేడ్–2 సెక్రటరీ విజయ్‌కిషోర్ జెండా ఊపి ప్రారంభించారు. కరపత్రాలు పంపిణీ చేయడం, రైతులతో సమావేశాలు నిర్వహించడం, ఇతరత్ర అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పచ్చి పసుపు వల్ల ధర రాక రైతులు నష్టపోయే అవకాశముందని ప్రచారం చేయనున్నారు.

క్వింటాలుకు రూ.12 వేలకుపైనే...!

పసుపు సాగు విస్తీర్ణం పడిపోవడంతో ఈసారి అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ ఏర్పడే అవకాశముంది. ఎండబెట్టిన పసుపు క్వింటాలుకు రూ.12 వేలకుపైనే పలుకుతుందని వ్యాపార, మార్కెటింగ్‌శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. వ్యాపారులు సైతం నాణ్యమైన, 12 లోపు తేమశాతం ఉన్న పసుపును కొనేందుకు ఆసక్తి చూపనున్నట్లు తెలుస్తోంది.

క్లుప్తంగా

'బేటీ బచావో.. బేటీ పడావో' ప్రతిజ్ఞ



సుభాష్‌నగర్‌: జాతీయ బాలికల దినోత్సవాలను పురస్కరించుకుని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌ హాల్‌లో 'బేటీ బచావో – బేటీ పడావో' కార్యక్రమంపై జిల్లా అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈమేరకు అంకితభావంతో కృషి చేస్తామని జిల్లా అధికారులు ప్రతిజ్ఞ చేసి సంతకాలు చేశారు. అనంతరం జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమ ఏర్పాట్లపై కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు సంబంధిత శాఖల అధికారులకు సూచనలు చేశారు. ఈనెల 25న జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమాలు విస్తృత స్థాయిలో నిర్వహించాలని కలెక్టర్‌ అన్నారు. పాఠశాల స్థాయితో పాటు ఇంటర్‌, డిగ్రీ విద్యార్థులకు వ్యాస రచన, ఉపన్యాస, చిత్రలేఖనం తదితర పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీపీ కల్మేశ్వర్‌ సింగేనవార్‌, అదనపు కలెక్టర్‌ యాదిరెడ్డి, ఐసీడీఎస్‌ పీడీ రసూల్‌ బీ, డీఈవో దుర్గాప్రసాద్‌, డీఐఈవో రఘురాజ్‌ తదితరులు పాల్గొన్నారు.



షబ్బీర్‌ అలీకి సన్మానం



ఖలీల్‌వాడి : మాజీ మంత్రి షబ్బీర్‌అలీ ప్రభుత్వ సలహాదారుగా నియమితులు కావడంతో మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత సన్మానించారు. సోమవారం హైదరాబాద్‌లోని ఫిల్మ్‌నగర్‌లోని షబ్బీర్‌ అలీ నివాసంలో కలిసి ఆమె శుభాకాంక్షలు తెలిపారు. ఆకుల రాఘవేందర్‌, కాంగ్రెస్‌ నగర అధ్యక్షుడు కేశ వేణు ఉన్నారు.

కార్యదర్శి అవినీతిపై విచారణ



సాక్షి ఎఫెక్ట్‌..

వర్ని : వర్ని మార్కెట్‌ కమిటీలో వడపోత యంత్రాల మోటార్ల గల్లంతు, ఇతర ఆరోపణలపై సోమవారం దక్షిణ తెలంగాణ రీజినల్‌ డిప్యూటీ డైరెక్టర్‌ పద్మ హర్ష విచారణ చేపట్టారు. 'అవినీతికి అడ్డా.. వర్ని ఏఎంసీ' శీర్షికన సాక్షి పత్రికలో ఈ నెల 19న ప్రచురితమైన కథనానికి మార్కెటింగ్‌ శాఖ అధికారులు స్పందించారు. విచారణ పూర్తయిన తర్వాత ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని ఆమె తెలిపారు.



పులకించిన భక్తజనం

అయోధ్య భవ్య మందిరంలో బాల రామయ్య కొలువదీరడంతో భక్తజనం పులకించింది. రాముడి ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో శ్రీరామ నామస్మరణతో జిల్లాలోని ఆలయాలు మారుమోగాయి. ప్రతి ఊరిలో ప్రత్యేక సంబురాలు నిర్వహించారు. శతాబ్దాల కల నెరవరడంతో హర్షం వ్యక్తం చేస్తూ పలువురు భక్తులు తమ అభిప్రాయాలు 'సాక్షి'తో పంచుకున్నారు.



ఇందల్వాయి రామాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

పూర్వ జన్మ సుకృతం



తండ్రి మాట జవదాటక 14 ఏళ్లు వనవాసం చేసిన రామునికి తన నివాసమైన అయోధ్యలో 500 ఏళ్ల తరువాత వనవాసం నుంచి విముక్తి లభించింది. ఇది ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందువుల విజయం. ప్రాణ ప్రతిష్ఠ పూజలో పాల్గొనడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తాను.

– పైడి రాకేశ్‌రెడ్డి, ఎమ్మెల్యే, ఆర్మూర్‌

ప్రతి ఒక్కరూ అయోధ్యను సందర్శించాలి..



హిందువులు అందరూ తమ జీవితంలో ఒక్కసారైనా అయోధ్య రామాలయాన్ని సందర్శించాలి. హిందువుల ఎన్నో ఏళ్ల కల సాకారమైంది. అయోధ్య రామాలయ క్రతువులో పాల్గొన్న వారందరికి ధన్యవాదాలు.

–కన్నె చిన్ను, నల్లవెల్లి

ఆనందం వర్ణనాతీతం



రామ మందిర ప్రారంభోత్సవాన్ని టీవీలో చూస్తుంటే ఎంతో సంతోషం కలిగింది. 30 ఏళ్ల కింద రామ శిల కార్యక్రమంలో పాల్గొన్నా. నాటి నుంచి మందిర నిర్మాణం కోసం ఎదురు చూస్తున్నాం. మందిరంలో రామయ్య కొలువుదీరడంతో కలిగిన ఆనందం వర్ణనాతీతం.

– చిదుర వీరేశం, శ్రీవిఠలేశ్వర ఆలయ కమిటీ చైర్మన్‌, రుద్రూర్‌

అయోధ్యలో దర్శించుకున్నట్లు ఉంది



టీవీలో రాముడి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం చూస్తుంటే అయోధ్యకు వెళ్లి శ్రీ రాముడిని చూసినట్లుగానే అనిపించింది. ఈ వేడుకలకు సంబంధించి అన్ని చోట్ల అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ వేడుక గురించి వర్ణించేందుకు మాటలు రావటం లేదు. అద్భుతంగా ఉంది. – చిలుక కిషన్‌, నగరవాసి

చరిత్రాత్మక ఘట్టం



బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ చరిత్రాత్మక ఘట్టంగా నిలిచిపోతుంది. దీని కోసం దేశ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. ప్రతిఒక్కరూ శ్రీరాముడిని ఆదర్శంగా తీసుకుని మంచి జీవిన విధానాన్ని అలవర్చుకోవాలి.

– ఎస్‌ ఉదయ్‌మహరాజ్‌, జ్యోతిష, వాస్తు పండితుడు, బోధన్‌

ప్రపంచవ్యాప్తంగా పండుగ



రామాలయ ప్రారంభోత్సవం ప్రపంచ వ్యాప్తంగా పండుగలా జరిగింది. ఎంతో మంది కఠోర శ్రమ, పోరాటాలతో శ్రీ రాముడి జన్మభూమిలో భవ్య రామమందిర నిర్మాణం సాకారమైంది.

– రాజేశ్వర్‌, బొర్ర గణేశ్‌ ఆలయ వ్యవస్థాపకుడు, బోధన్‌

ఆత్మగౌరవం నిలబడింది



అయోధ్యలో రామ మందిరం నిర్మాణంతో హిందువుల ఆత్మగౌరవం నిలబడింది. 1992లో కరసేవకులుగా అయోధ్యకు వెళ్లిన రోజులను గుర్తు చేసుకుంటే ఎప్పుడెప్పుడు వెళ్లి బాలరాముడి దర్శనం చేసుకోవాలా అని ఆతృతగా ఉంది.

– జెస్సు అనిల్‌, కరసేవకుడు, ఆర్మూర్‌

ఇది మహోత్సవం



రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఉత్సవం కాదు మహోత్సవం. ఈ రోజు కోసం ఎంతోమంది ఎదురు చూశారు. ఈ తరం వారికి అయోధ్య వేడుకలు చూసే అవకాశం రావటం అదృష్టం.

– మోగ సుబేదార్‌, నగరవాసి

కల సాకారమైంది



రాముడి జన్మభూమిలో బాల రాముడి ప్రాణప్రతిష్ఠతో ప్రపంచంలోని హిందువులందరి కల సాకారమైంది. శ్రీరాముని ప్రాణ ప్రతిష్ఠను పండుగలా జరుపుకుని భక్తిని చాటుకున్నారు. – ప్రవీణ్‌మహరాజ్‌, మారుతి మందిర్‌ ప్రధాన అర్చకుడు, బోధన్‌

దర్శనం చేసుకోవాలి



14 ఏళ్ల వయసులో రామ జన్మభూమిని సంరక్షించడానికి జరిగిన ఉద్యమంలోపాల్గొన్నాను. నరేంద్ర మోదీ సంకల్పంతో నిర్మితమై ప్రాణ ప్రతిష్ఠ చేసుకున్న అయోధ్య బాల రాముడి దర్శనం చేసుకోవాలనే తాపత్రయం ఉంది. త్వరలో దర్శనం చేసుకుంటాను. – పోహార్‌ శైలేష్‌, కరసేవకుడు, ఆర్మూర్‌

అద్భుతమైన క్షణం



విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం ఇక్కడి నుంచి తిలకించటం అద్భుతమైన క్షణం. ప్రాణ ప్రతిష్ఠాపన కార్యక్రమం చూసే అవకాశం దక్కటం ఎన్నో జన్మల పుణ్యం. దీంతో నా జన్మ ధన్యం అయ్యింది.

– జీవన్‌దేశాయి, గాజుల్‌పేట్‌

మనసు పులకరించింది



500 ఏళ్ల తర్వాత రాముడు భవ్య మందిరంలో కొలువుదీరడం చాలా సంతోషం. ఈ ఘట్టం చూస్తుంటే మనసు పులకరించి, రోమాలు నిక్కబొడుచుకున్నాయి. జై శ్రీరాం అంటూ మా కాలనీలో వివిధ కార్యక్రమాలు నిర్వహించాం.

– చంద్రశేఖర్‌గౌడ్‌, మహాలక్ష్మీనగర్‌ కాలనీ

పెండింగ్‌ దరఖాస్తులు పరిష్కరించాలి

- కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్‌ : ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ పెండింగ్‌ దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 39 ఫిర్యాదులు అందాయి. కలెక్టర్‌ మాట్లాడుతూ.. ప్రజావాణి వినతులపై తీసుకున్న చర్యల గురించి ఫిర్యాదుదారులకు తెలియజేయాలన్నారు. కాగా అయోధ్యలో బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఫిర్యాదుదారులు లేక ప్రజావాణి కార్యక్రమం వెలవెలబోయింది. అదనపు కలెక్టర్‌ యాదిరెడ్డి, జెడ్పీ సీఈవో గోవింద్‌, డీఆర్డీవో చందర్‌, డీపీవో జయసుధ, ఆర్డీవో రాజేంద్రకుమార్‌ పాల్గొన్నారు.

మూత్రశాలలు నిర్మించాలి

సారంగాపూర్‌ జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు సోమవారం ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. పాఠశాలలో బాలికల కోసం ఒకే టాయిలెట్‌ ఉందని, ఉపాధ్యాయులు, బాలికలు, బాలుర కోసం వేర్వేరు మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మించాలని కోరారు. అలాగే అర్సాపల్లి నుంచి అశోక్‌సాగర్‌ వరకు డివైడర్‌ ఏర్పాటు చేయాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నాయకులు అక్బర్‌ నవాజుద్దీన్‌, రాజు, అఫ్సర్‌, అశోక్‌, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు సమస్యను విన్నవిస్తున్న విద్యార్థి సంఘాలు

ఆల్ఫోర్స్‌ కళాశాలపై చర్యలు తీసుకోవాలి

నగరంలోని ముబారక్‌నగర్‌, వినాయక్‌నగర్‌లో కమర్షియల్‌ భవనాలు చూపించి అనుమతి లేకుండా అడ్మిషన్లు తీసుకుంటున్న ఆల్ఫోర్స్‌ కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్‌, ఎస్‌ఎఫ్‌ఐ, టీవీయూవీ, పీడీఎస్‌యూ, జీవీఎస్‌, టీఎస్‌ఎఫ్‌ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కలెక్టర్‌ స్పందించి అడ్మిషన్లు జరగకుండా చూడాలని, లేకుంటే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మోసపోయే అవకాశముందని తెలిపారు. వెంటనే చర్యలు తీసుకోకపోతే విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. నాయకులు అఖిల్‌, లాల్‌ సింగ్‌, అంజలి, రఘురాం, జైత్రాం రాథోడ్‌, మహేష్‌రెడ్డి, మహేష్‌, సందీప్‌ పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడుతున్నారని అధికారులపై ఫిర్యాదు..

నిజామాబాద్‌నాగారం: తెలంగాణ రాష్ట్ర విద్యా సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (టీఎస్‌ ఈడబ్ల్యూఐడీసీ) ఆధ్వర్యంలో నిర్మిస్తున్న మైనారిటీ గురుకుల పాఠశాలల భవన నిర్మాణాల్లో ఆ శాఖ ఈఈ దేవిదాస్‌, డిప్యూటీ ఈఈ అంజిరెడ్డి, ఏఈలు మారుతి, ఉదయ్‌కిరణ్‌, గణేష్‌ అక్రమాలకు పాల్పడతున్నారని ఆర్మూర్‌కు చెందిన ఖాందేష్‌ సుందర్‌ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. జిల్లాలో నాగారం, అర్సపల్లి, మాక్లూర్‌ ప్రాంతాల్లో ఐదు మైనారిటీ గురుకుల పాఠశాలలకు సంబంధించి రూ.100కోట్లు మంజూరు అయ్యాయన్నారు. అధికారులు సక్రమంగా పని చేయకుండానే రూ. లక్షలు దండుకుంటున్నారన్నారు. దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

వసతులు లేవన్నారు.. గుర్తింపు ఇచ్చారు!

- చర్చనీయాంశంగా తెయూ అధికారుల తీరు

నిజామాబాద్‌అర్బన్‌ : నగరం నడిబొడ్డున గల ఓ ప్రైవేట్‌ డిగ్రీ కళాశాలకు శాశ్వత అనుబంధ గుర్తింపుపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గతేడాది తెలంగాణ యూనివర్సిటీ ఆడిట్‌ సెల్‌ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో ఈ కళాశాలలో అనేక లోపాలు ఉన్నాయని గుర్తించారు. వసతులు, అధ్యాపకులు లేరని, ఆటస్థలం, పార్కింగ్‌ స్థలం, సరిపడా లైబ్రరీ పుస్తకాలు, పరిశోధన పరికరాలు లేవని గుర్తించినట్లు అధికారులు మీడియాకు కూడా చెప్పారు. కానీ ప్రస్తుతం అదే కళాశాలకు శాశ్వత అనుబంధ గుర్తింపు ఇవ్వడంలో ఆంతర్యం ఏమిటి పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రతి యేటా యూనివర్సిటీ అధికారులు కాలేజీలను తనిఖీ చేసి లోపాలను గుర్తించి సరి దిద్దుకోవాలని సూచిస్తుంటారు. కొన్ని కళాశాలలు యూనివర్సిటీ అధికారుల ఆదేశాలను పాటిస్తుండగా.. సదరు ప్రైవేట్‌ డిగ్రీ కాలేజీ మాత్రం పట్టించుకోవడం లేదు. అయినా ఈ కళాశాలకు న్యాక్‌ ఏ గ్రేడ్‌ గుర్తింపు, అటానమస్‌ హోదా వచ్చేందుకు యూనివర్సిటీ అధికారులు కృషి చేశారనే ఆరోపణలు ఉన్నాయి. నామమాత్రము తనిఖీలను నిర్వహించి ఒక సంవత్సరానికి ఇవ్వాల్సినటువంటి అనుబంధ గుర్తింపును శాశ్వతంగా ఇచ్చేలా కృషి చేశారు.

మరోవైపు అటానమస్‌ హోదా పొందిన సదరు కాలేజీ సొంతంగా పరీక్షల నిర్వహణ కోసం ప్రయత్నాలు చేస్తోంది. సదరు కాలేజీపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.

బీఆర్‌ఎస్‌ నేతలకు భయం పట్టుకుంది

- అవినీతి బయటకు వస్తుందనే ఇష్టమొచ్చినట్లు వ్యాఖ్యలు
- కాంగ్రెస్‌ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న మానాల మోహన్‌రెడ్డి

ఖలీల్‌వాడి : బీఆర్‌ఎస్‌ హయాంలో చేసిన అవినీతి బయటకు వస్తుందని భయపడి కేటీఆర్‌, హరీష్‌ రావు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని కాంగ్రెస్‌ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్‌ భవన్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చి రేవంత్‌ రెడ్డి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడాన్ని బీఆర్‌ఎస్‌ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. గత ప్రభుత్వం చేసిన అవకతవకలు, నిర్వీర్యం చేసిన వ్యవస్థలను తమ ప్రభుత్వం సరి చేస్తున్నట్లు చెప్పారు. కానీ కేటీఆర్‌, హరీశ్‌రావు ఎక్కడ వాళ్ల డొల్లతనం, అవినీతి బయటపడుతుందో అని భయపడి కరెంటు బిల్లు సోనియాగాంధీకి పంపుతామని పిచ్చికూతలు కూస్తున్నారని ఎద్దేవా చేశారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తామన్నారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌ బీన్‌ హందాన్‌, అంతిరెడ్డి రాజిరెడ్డి, సయ్యద్‌ ఖై సర్‌, సర్దార్‌ నరేంద్ర సింగ్‌ పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న టీజీసెట్‌ దరఖాస్తు గడువు

డిచ్‌పల్లి : రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, మహాత్మ జ్యోతిరావుపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధారణ గురుకుల పాఠశాలల్లో 2024–25 సంవత్సరానికి ఐదో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుకు మంగళవారం (ఈ నెల 23న) తుది గడువని సంస్థ రీజినల్‌ కోఆర్డినేటర్‌ కే అలివేలు, జిల్లా కోఆర్డినేటర్‌ బి సంగీత ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దర ఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ట్రాన్స్‌ఫార్మర్లే టార్గెట్‌..

- రెచ్చిపోతున్న దొంగలు
- కాపర్‌ వైర్‌, ఆయిల్‌ చోరీ
- కరెంట్‌ లేక ఎండుతున్న పంటలు

నిజాంసాగర్‌ : వ్యవసాయ భూముల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లే లక్ష్యంగా దొంగలు రెచ్చిపోతున్నారు. మద్యానికి, జల్సాలకు అలవాటు పడిన కొందరు సులువుగా డబ్బు సంపాదించాలని ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్‌ వైర్లు, ఆయిల్‌ చోరీ చేస్తున్నారు. అర్ధరాత్రి కరెంట్‌ ఉన్న సమయాల్లోనూ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్‌ వైరు, ఆయిల్‌ ఎత్తుకెళ్తున్నారు. రెండు రోజుల కిందట నిజాంసాగర్‌ శివారులో, నాలుగు రోజుల క్రితం గోర్గల్‌ శివారులో రెండు ట్రాన్స్‌ఫార్మర్లను చోరీ చేశారు. నాలుగు నెలల సమయంలో మండలంలోని అచ్చంపేట, బ్రాహ్మణపల్లి, ఆరేడ్‌, సుల్తాన్‌నగర్‌ శివారుల్లో 12 ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేశారు.

పంట ఎండిపోతుంది

గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి ఆయిల్‌, వైర్లను ఎత్తుకు వెళ్లారు. నాలుగు రోజుల నుంచి మోటార్‌కు కరెంట్‌ లేదు. దీంతో నీరందక పంట ఎండుతోంది. అధికారులు తొందరగా కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ ఇవ్వాలి. లేకపోతే పక్క ట్రాన్స్‌ఫార్మర్‌ నుంచి కనెక్షన్‌ ఇచ్చి ఆదుకోవాలి.

– సత్యాగౌడ్‌, బాధిత రైతు, నిజాంసాగర్‌

కేసు నమోదు చేస్తేనే ట్రాన్స్‌ఫార్మర్‌

చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్లకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసి, ఎఫ్‌ఐఆర్‌ ఇస్తేనే బాధిత రైతులకు నెల, రెండు నెలల్లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ ఇస్తాం. ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలపై పోలీసులకు ఫిర్యాదు చేశాం. ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు గుర్తు తెలియని వ్యక్తులు వస్తే రైతులు మాకు సమాచారం ఇవ్వాలి. – లక్ష్మణ్‌, ట్రాన్స్‌కో ఏఈ, నిజాంసాగర్‌

రైతుల తిప్పలు

ఒక్కొక్క ట్రాన్స్‌ఫార్మర్‌ నుంచి వంద లీటర్ల వరకు ఆయిల్‌, 15 కిలోల కాపర్‌ వైర్‌ను ఎత్తుకెళ్తున్న దొంగలకు రూ.45 వేల నుంచి రూ.60 వేల లబ్ధి పొందుతున్నారు. కానీ సదరు రూ.లక్ష ఖర్చు చేస్తే తప్పా మళ్లీ ట్రాన్స్‌ఫార్మర్‌ దొరకని పరిస్థితి ఉంది. ట్రాన్స్‌ఫార్మర్లను పాడు చేయడం సులువు అయినా సదరు ట్రాన్స్‌ఫార్మర్‌ను సాధించడం రైతులకు తలకు మించిన భారంగా మారుతోంది. అంతేగాకుండా కరెంట్‌ లేకపోవడంతో పంటలకు నీరు అందించడానికి అన్నదాతలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వేల రుపాయల పెట్టుబడులు పెట్టి పంట సాగు చేస్తుంటే ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఆగమాగం అవుతున్నారు. పోలీసులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

మాజీ సైనిక ఉద్యోగుల సంక్షేమానికి పాటుపడుతాం

నిజామాబాద్‌నాగారం : మాజీ సైనిక ఉద్యోగుల సంక్షేమానికి పాటుపడుతామని సుబేదార్‌ ఏఎస్‌ రావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో జిల్లా సైనిక వెల్ఫేర్‌ ఆర్గనైజేషన్‌ ఆధ్వర్యంలో మాజీ సైనికులతో సమావేశం నిర్వహించారు. మాజీ సైనికుల సమస్యలు, వారికి రావాల్సిన రిటైర్మెంట్‌ బెన్ఫిట్స్‌ గురించి తెలుసుకున్నారు. మద్రాస్‌ రేంజిమెంట్‌ పరిధిలో పని చేసిన మాజీ సైనికోద్యుగుల సంక్షేమానికి పాటుపడుతామన్నారు. ఉద్యోగులు ప్రధాన్‌, జైసాగర్‌, గంగా శేఖర్‌ తదితరులున్నారు.



మాజీ సైనికుడిని సన్మానిస్తున్న దృశ్యం

క్రైం కార్నర్‌

రైలునుంచి పడి ఒకరికి తీవ్ర గాయాలు



కామారెడ్డి క్రైం : ప్రమాదవశాత్తు రైలులో నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన జిల్లా కేంద్రానికి సమీపంలోని అడ్లూరు శివారులో సోమవారం వేకువజామున వెలుగు చూసింది. దాదాపు 40 ఏళ్ల వయస్సు గల వ్యక్తి రైలులో నుంచి పడగా తలకు తీవ్రంగా గాయాలు అయ్యాయి. స్థానికులు గమనించి రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. క్షతగాత్రుడిని ఏరియా ఆస్పత్రికి తరలించి రైల్వే ఎస్సై తావూ నాయక్‌ విచారణ జరిపారు. గాయపడిన వ్యక్తి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. ప్రస్తుతం అతను అపస్మారక స్థితిలో ఉన్నాడు.

బైక్‌పై నుంచి పడి యువకుడికి..



దోమకొండ : దోమకొండ శివారులోని అభ్యుదయ పాఠశాల వద్ద సోమవారం కుక్క అడ్డు రావడంతో బైక్‌పై నుంచి పడి సందెల దినేష్‌ అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. బీబీపేట్‌ నుంచి దోమకొండకు వస్తుండగా కుక్క ఎదురుగా వచ్చింది. బైక్‌ మధ్యలో కుక్క ఇరుక్కుపోగా అదుపుతప్పి కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయాలు కాగా కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స కోసం కామారెడ్డికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కొసం హైదరాబాద్‌లోని ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి



శంకర్‌ (ఫైల్‌)

తాడ్వాయి : మండలంలోని సోమారం శివారులో అనుమానాస్పద స్థితిలో ఒకరు మృతి చెందారు. ఈ ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు.. తాడ్వాయి గ్రామానికి చెందిన ముదాం శంకర్‌(45) మృతదేహం మండలంలోని సోమారం శివారులో సోలార్‌ ప్లాంట్‌ సమీపంలో రోడ్డు పక్కన పడి ఉంది. సోమవారం ఉదయం సమాచారం అందుకున్న ఇన్‌చార్జి సీఐ శ్రీనివాస్‌, ఎస్సై ఆంజనేయులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహం వద్ద రక్తం మరకలు పరిశీలించగా సమీపంలోని వ్యవసాయ భూమి వరకు ఉన్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు శంకర్‌ తలపై కొట్టి హత్య చేసినట్లు తెలుస్తోంది. వ్యవసాయ భూమిలో హత్య చేసి అరకిలో మీటరు దూరంలో ఉన్న సోమారం శివారులోని రోడ్డుపై పడేసి, రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించారు. దీంతో పోలీసులు డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి తనిఖీలు చేశారు. మృతుడికి భార్య లక్ష్మి, కూతురు రాధిక ఉన్నారు. లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మృతదేహం లభ్యం

నవీపేట : మండలంలోని యంచ గోదావరి నది తీరంలో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్సై యాదగిరి గౌడ్‌ తెలిపారు. మూడు రోజుల కిందట ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని ఆయన పేర్కొన్నారు. 30 నుంచి 35 ఏళ్ల లోపు గల మృతుడి ఒంటిపై టీ షర్టు, ప్యాంటు ఉన్నట్లు తెలిపారు. జీపీ కార్యదర్శి సుధా రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

జేసీబీ, మొరం టిప్పర్ల పట్టివేత

మాక్లూర్‌ : రాత్రి సమయాల్లో మొరం తరలిస్తున్న ఒక్క జేసీబీతో పాటు, రెండు టిప్పర్లను టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు ఆదివారం తెల్లవారుజామున పట్టుకుని మాక్లూర్‌ పోలీసులకు అప్పగించారు. మండలంలోని అడవి మామిడిపల్లి శివారు నుంచి నిజామాబాద్‌లోని వెంచర్లకు మొరం తరలిస్తున్నారనే సమాచారం మేరకు ఈ దాడులు చేసినట్లు టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు తెలిపారు. పట్టుబడిన జేసీబీ దాస్‌నగర్‌కు చెందిన దాసుదిగా గుర్తించామన్నారు. రెండు మొరం టిప్పర్లు కూడా అదే గ్రామానికి చెందిన వారివని తెలిపారు.

డ్రంకన్‌ డ్రైవ్‌లో ఇద్దరికి జైలుశిక్ష

కామారెడ్డి క్రైం : మద్యం తాగి వాహనం నడిపిన కేసులో కామారెడ్డి కోర్టు ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష విధించింది. రెండు రోజుల క్రితం పట్టణ పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా పట్టణానికి చెందిన రాంచంద్రం, యాదగిరి డ్రంకన్‌ డ్రైవ్‌లో పట్టుబడ్డారు. వారిని సోమవారం కోర్టుకు హాజరుపరిచారు. ద్వితీయశ్రేణి న్యాయమూర్తి ప్రతాప్‌ వారికి రెండు రోజుల జైలు శిక్ష, రూ.200 చొప్పున జరిమానా విధించినట్లు ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌ రెడ్డి తెలిపారు.